**ఆకాశవాణి విజయవాడ కేంద్రం**

**ప్రాంతీయవార్తా విభాగం 17-05-2012, గం॥ 6.45 ని॥**

# హెడ్‌లైన్స్

1. రాష్ట్రంలో వచ్చేనెల 12వ తేదీన జరిగే ఉప ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ రేపు నోటిఫికేషన్ జారీ చేస్తుంది.
2. ఉప ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల ముఖ్యఅధికారి భన్వర్‌లాల్ అధికారులతోను రాజకీయ పార్టీల నాయకులతోను ఈరోజు సమీక్ష జరుపుతారు.
3. రాష్ట్రంలో ఇసుక త్రవ్వకాలపై సుప్రీంకోర్టు నిర్దేశాల నేపథ్యంలో కృత్రిమ ఇసుక రోబోస్టాండ్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
4. రాష్ట్రంలో పలుచోట్ల నిన్న వేసవి ఉష్ణోగ్రతలు, వడగాలులు గణనీయంగా పెరిగాయి.

## ఎలెక్షన్స్ :

రాష్ట్రంలో వచ్చేనెల 12వ తేదీన జరిగే ఉప ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమీషన్ రేపు నోటిఫికేషన్లు దాఖలు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈనెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. కాగా, ఉప ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల ముఖ్యఅధికారి భన్వర్‌లాల్ ఈరోజు సమీక్షిస్తారు. ఎన్నికలు జరిగే 12 జిల్లాల కలెక్టర్లు యస్‌పిలతో ఈరోజు హైదరాబాద్ నుంచి సమీక్ష నిర్వహిస్తారు. ఉప ఎన్నికలను స్వేచ్ఛగా సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల నియమావళి అమలు చేసేందుకు ఓటర్ల నమోదు భద్రతా ఏర్పాటు తదితర అంశాలను ఈ సందర్భంగా చర్చిస్తారు.

ఇలా ఉండగా ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలుచేసే విషయమై రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం ఈ సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసినట్టు భన్వర్‌లాల్ తెలియజేశారు. కోడ్ అమలు ఎన్నికల వ్యయంపై ప్రధానంగా చర్చించనున్నట్టు ఆయన చెప్పారు. గుర్తింపు పొందిన రాజీకయ పార్టీలు కాంగ్రెస్, సిపిఐ, సిపియమ్, బిజెపి తెలుగు దేశం టిఆర్‌యస్, బియస్‌పి మజ్లిస్ పార్టీలను ఈ సమావేశానికి ఆహ్వానించినట్టు ఆయన తెలిపారు.

ఇలా ఉండగా నెల్లూరు లోక్‌సభ నియోజక వర్గంతోపాటు 18 శాసనసభ నియోజక వర్గాల్లో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. దివంగత ముఖ్యమంత్రి డా॥ వైయస్.రాజశేఖర్‌రెడ్డి పేరును సిబిఐ, ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేసినందుకు నిరసనగా నెల్లూరు లోక్‌సభ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుడు రాజీనామా చేయటం వలన ఆ నియోజక వర్గంలో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. కాగా గత డిశంబర్‌లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు చేసిన 17 మంది కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుల సభ్యత్వాలను స్పీకర్ రద్దు చేయడం వల్ల, కర్నూలు జిల్లా ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో అప్పటి ప్రజారాజ్యం పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యురాలు రాజీనామా చేయడం వల్ల ఉప ఎన్నికలు జరుగుతున్నాయి.

ఎఫ్‌ఒసి – హైదరాబాద్

-------------

## ఇసుక :

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టు నిర్దేశాల నేపథ్యంలో కృత్రిమ ఇసుక రోబోశాండ్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన పర్యావరణ అనుమతులతో ఇసుక తవ్వకాలు జరిపేందుకు చర్యలు చేపట్టినట్టు గనులశాఖ మంత్రి గల్లా అరుణకుమారి నిన్న హైదరాబాద్‌లో విలేకర్లకు తెలిపారు. భవనాలు వంతెనలు రహదార్ల నిర్మాణంలో ఈ కృత్రిమ ఇసుక వాడే విషయమై రోడ్లు భవనాల శాఖ అధికార్లతో చర్చిస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. రోబో శాండ్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ కృత్రిమ ఇసుక ఉత్పత్తికి స్టోన్‌క్రషింగ్ సంస్థలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు. భూగర్భ గనులశాక ఇప్పటికే అనుమతులిచ్చిన 15 ఇసుక రీచ్‌లలో రాష్ట్ర గనుల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా తవ్వకాలు చేపట్టేందుకు కేంద్ర పర్యావరణశాక అనుమతి కోరినట్టు మంత్రి తెలిపారు. విశాక గుంటూరు వరంగల్ మహబూబ్‌నగర్ జిల్లాలోని 29 ప్రాంతాల్లో పట్టాభూముల్లో, ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరిపేందుకు అనుమతులు మంజూరు చేసినట్టు గల్లా అరుణకుమారి తెలియజేశారు.

ఎఫ్‌ఒసి – హైదరాబాద్

--------------

## ఐఐఐటి :

రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ళ ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం నిన్న నోటిఫికేషన్ విడుదల చేసింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి రాజ్‌కుమార్ హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ నాన్–రెసిడెంట్ పాఠశాలల్లో పదోతరగతి చదివిన విద్యార్థులకు వెనుకబాటు సేచిపేరిట 4 శాతం మార్కులను అదనంగా కలపనున్నట్టు తెలియజేశారు. బాసర నేజివీడు, ఇదుపల పాయలలో ఉన్న ట్రిపుల్ ఐటిల్లో 3 వేల సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకు పదోతరగతి ఉత్తీర్ణులు ఈనెల 28 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

--------------

## ఉక్కుకర్మాగారం :

విశాక ఉక్కు కర్మాగారంలో ఒక్క శాతం వాటా విక్రయించినా సహించేదిలేదని విశాఖ ఉక్కు కర్మాగారం గుర్తింపు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు యన్.రామారావు డి.ఆదినారాయణ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. విశాఖలో నిన్న ఈమేరకు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వాన్ని ఉక్కు యాజమాన్యాన్ని వాటాల విక్రయ యోచనపై గతంలో హెచ్చరించినప్పటికీ 10 శాతం వాటాల అమ్మకానికి ప్రభుత్వం నిర్ణయించినట్టు ఉక్కు శాక మంత్రి పార్లమెంట్‌కు రాత పూర్వకంగా తెలియజేయడాన్ని వీరు ఖండించారు.

ఎఫ్‌ఒసి – వైజాగ్

--------------

## ఎక్జామ్స్ :

ఇంటర్మీడియట్ ఎడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా ఈ ఉదయం మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్ వన్ పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షకు సెట్‌నెంబర్ ఒకటి ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశారని ఇంటర్మీడియట్ బోర్డ్ తెలియజేసింది.

డెస్క్

--------------

# బ్రేక్

## వేసవి వేడి :

రాష్ట్రంలో పలుచోట్ల నిన్న వేసవి ఉష్ణోగ్రతలు, వడగాల్పులు గణనీయంగా పెరిగాయి. వేసవి తీవ్రతను సాధారణ జనజీవనం అస్తవ్యస్తమైంది. కొత్త గూడెంలో నిన్న అత్యధికంగా 48.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. రామగుండంలో 45 ఒంగోలు, బాపట్ల, ఖమ్మం, వరంగల్‌లో 43 డిగ్రీల చొప్పున, విజయవాడ నెల్లూరు, రాజమండ్రిలో 41 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో మరికొన్ని రోజులపాటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

డెస్క్

--------------

## బీడీ :

రాష్ట్రంలో 10 లక్షల మంది బీడీ కార్మికుల కోసం అన్ని మండల కేంద్రాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేసి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది, సత్యం ప్రభుత్వాన్ని కోరారు. నిజామాబాద్‌జిల్లా కామారెడ్డిలో ఆయన నిన్న విలేకర్లతో మాట్లాడుతూ బీడీ పరిశ్రమలలో పనిచేసే కార్మికుల ప్రయోజనాలకోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ వాటి అమలుకు అధికారులు సరయిన విధంగా స్పందించడం లేదని ఆరోపించారు. బీడీ కార్మికులకు ఇళ్ళనిర్మాణం, పెరిగిన కరువు భత్యం, పించన్ల వంటి సౌకర్యాలు కల్పించాలని సత్యం పేర్కొన్నారు.

పిటిసి – నిజామాబాద్

--------------

## ఎఐఆర్ :

ఆకాశవాణి కొత్తగూడెం కార్యక్రమ సార్వహణ అధికారి గొక్కం కామేశ్వరరావు రచించిన కవితాసంపుటి చిదాకాశం ప్రవచనాల సంపుటి జ్ఞానామృతంలను ఆకాశవాని దక్షిణప్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ ఆర్.వెంకటేశ్వర్లు నిన్న విశాఖలో గడిచిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్విక భావాలతో కూడిన రచనలు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. హైదరాబాద్ ఆకావవాణి విజయవాడ కేంద్రం సంచాలకుడు మంగళగిరి అదిత్య ప్రసాద్ తదితర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎఫ్‌ఒసి – వైజాగ్

--------------

## న్యూక్లియర్ :

అణు విద్యుత్‌ను తిరస్కరిస్తే దేశానికే నష్టమని అదనపు వనరుగా అణువిద్యుత్‌కు ఎంతో ప్రాధాన్యం ఉందని ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ లోక్‌సభలో నిన్న వెల్లడించారు.

డెస్క్

--------------

## బడ్జెట్ :

వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ 65 కోట్ల రూపాయలతో బడ్జెట్‌ను నిన్న ఆమోదించింది. నగరంలో రెండొందల అడుగుల విస్తీర్ణంలో రింగ్‌లను ఏర్పాటుచేసి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ బొజ్జా చెప్పారు. పురపాలక సంస్థ కమీషనర్ వివేక్ యాదవ్ తదితర్లు నిన్న పురపాలక మండలి ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు.

పిటిసి – వరంగల్

--------------

## ఖరీఫ్ :

కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికార్లు ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేశారు. 5 లక్షల 40 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికార్లు అంచనావేస్తున్నారు. గత ఏడాది కన్నా లక్ష హెక్టార్లకు సాగు విస్తీర్ణం పెరుగుతున్నట్టు జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ప్రసాద్ తెలిపారు. ఒక లక్షా 64 వేల హెక్టార్లలో వరి సాగవుతుందని ఆయనపేర్కొన్నారు. శ్రీవరిసాగును లక్ష హెక్టార్లలో చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఒక లక్షా 12 వేల హెక్టార్లలో ఆరుతడి పండలసాగు చేపడతామని ఆయన చెప్పారు.

డెస్క్

--------------

## డంప్ :

ఆదిలాబాద్ జిల్లా జిన్నారం మండలం దొంగపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాచిన భారీ డంప్‌ను కనుగొన్నట్టు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ త్రిపాది తెలిపారు. మావోయిస్టుల భారీ డంప్‌ను ఎస్.పి. నిన్న విలేకర్లకు ప్రదర్శించారు. మూడు కేజీల గన్‌పౌడర్ తుపాకీ గుళ్ళు డెటోనేటర్లు వందల సంఖ్యలో డైరీలు మ్యాపులు వీడియో ఆడియో క్యాసెట్లు లభించినట్టు యస్.పి. తెలియజేశారు.

డెస్క్

--------------

## వేరుశనగ :

చిత్తూరుజిల్లాలోని వేరుశనగ రైతులకు ఖరీఫ్ కాలంలో ఒకకోటి 10 లక్షల క్వింటాళ్ళ విత్తనాలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ సాల్మన్ ఆరోగ్యరాజ్ తెలిపారు. వేరుశనగ విత్తనకాయల పంపిణీపై విత్తన సంస్థలతో కలెక్టర్ నిన్న సమావేశం నిర్వహించారు. ఈనెల 25లోపు జిల్లాకు 60 వేల క్వింటాళ్ళ విత్తనకాయలు వస్తాయని చెప్పారు. నాణ్యమైన వేరువనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

డెస్క్

--------------

## మావోయిస్టు :

మావోయిస్టులు దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నిన్న ఖమ్మం జిల్లా భద్రాచలంలో చెట్టునరికి రోడ్డుకు అడ్డుగా వేశారు. నిషిద్ధ సిపిఐ మావోయిస్టు ఈ బంద్‌కు పిలుపునిచ్చింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్, ప్రతిపాదిత జాతీయ తీవ్రవాద వ్యతిరేక కేంద్రం యన్‌సిటిసికు వ్యతిరేకంగా మావోయిస్టులు ఈ బంద్ జరిపారు.

పిటిఐ

..................